# ఇంకేం కావాలి ?

తమకు పెళ్ళై పదేళ్ళైంది. పిల్లలు లేరు.

మొదట్లో రమకదేం చింతగా లేదు. రాజు అంతగా పట్టించుకోలేదు.

కాలం గడుస్తున్న కొద్దీ ఇరుగు పొరుగు ఇబ్బందెక్కువ కాసాగింది.

అత్తామామలు ఏమీ అనలేదు. కానీ అనకపోవటమే బాధగా వుంది. ఏమన్నా అంటే బాగుంటుందని ఆశించింది రమ. నిరాశే.

ఆ నిరాశ ఎంతో కాలం లేదు. అమ్మానాన్నల్ని పండక్కి పిలిచి మర్యాద లన్నీ చేసి మర్యాదగా ప్రారంభించి అమర్యాదగా తిట్టిపోశారు.

సారాంశం పిల్లల్లేకపోతే వాళ్ళేం భార్యా భర్తలు? ఇదేం సంసారం?

మొదట్లో రమ రాజులు పిల్లలు వద్దనుకొని ఇలా ఉంటున్నారు కాబోలునని చుట్టుప్రక్కల వాళ్ళు చెవులు కొరుక్కోనకపోలేదు.

వాళ్ళ చెవుల తిమ్మిరి వదలక ముందే అది సత్యం కాదని ఋజువు అయిపోయింది.

వాళ్ళిద్దరూ డాక్టరు దగ్గరకు పోయి పరీక్ష చేయించుకొని వచ్చారు. ఏం లోపం లేదట! పిల్లలు కలుగుతారట!

మరేం? ఎందుకు కలగలేదు? అనేవాళ్ళు డాక్టరును అడిగారు.

అందుకు నేనేం చెబుతాను అనేసి వూరుకొన్నాడు డాక్టరు.

వాళ్ళ నల్గురికీ వీరిద్దరు. అందుకు మేమేం చెబుతాము అని మొరాయించారు.

అంతటితో ఆగలేదు. "దీనికి పిల్లల్ని కనే రాతలేదు" అని రమ తల్లి సతాయించింది.

రమ అత్త పిల్లలు కోసం మొక్కుబళ్ళు ప్రారంభించింది. శాంతులు చేయించింది. పూజలు చేసింది. ఆదేదో నోము నోచింది.

ఏం లాభం లేదు !

పిల్లలు కలగలేదు.

రమ రాజుల అమ్మ నాన్నలు వీరిద్దర్నీ పుణ్యక్షేత్రాలకు, తీర్థాలకు పట్టు బట్టితోలారు.

దేవుళ్ళ దర్శనాలకంటే నాల్గూళ్ళు తిరగటం ఇద్దరికీ బాగానేవుంది.

చాలా మంది దేవుళ్ళను దర్శించారు.

చాలా తీర్థాలలో మునిగారు.

చాలా రోజులైంది.

ఏం లాభం? పిల్లల్లేరు!

ఒక రోజు దూరపు బంధువు, పండు ముసలి, పాతిక మంది మనవళ్ళకి, పది మంది మనవరాళ్ళకి వంశకర్త, వచ్చాడు. వచ్చీ రావటంతోనే మీరసలు ఆడా మగా మనుషులేనా? అని ప్రాథమిక ప్రశ్న వేశాడు.

'ఏం సంగతి' అని ఇద్దరూ ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకొన్నారు.

"ఎందుకలా గుడ్లు మిటకరిస్తారు. తెల్చి చెప్పండి?" అని మునుం పెట్టి దంచుతున్నాడు.

ఈ ప్రశ్నల పోట్లు తట్టుకోలేక సినిమాకు పోయారు.

'ఎంత మంచి జంట!' వీధిలోని వాళ్ళు వాళ్ళనిచూచి ముక్కు మీద వేలేసుకున్నారు.

ముక్కు మీద వేలెందుకు వేసుకుంటారో పాపం వాళ్ళు?

చిలకాగోరింకల్లా వున్నారని చాలా మంది ఒప్పుకొన్నారు. మొగుడూ పెళ్ళాం అంటే అలా వుండాలని అనుకొన్నారు.

వాళ్ళను చూడటం కళ్ళ పండగ్గా భావించుకొన్నారు.

వాళ్ళదేం అన్యోన్య దాంపత్యం కాకపోలేదు.

కాదంటే సంతానమే కలగలేదు.

ఎందుకు కలగలేదు?

అదే అంతుబట్టటం లేదు

వాళ్ళ అనురాగం పొరుగువాళ్ళు అసూయ పడేంతగా వుంది.

వయసులో వున్నారు. ఆరోగ్యం లోపంలేదు.

వాళ్ళు వద్దనుకోవడం లేదు. పైగా సంతానం కావాలనుకొంటున్నారు.

డాక్టర్లతో మాట్లాడారు.

తీర్థాలలో మునిగారు. పుణ్యక్షేత్రాలు దర్శించారు.

తినటానికి కావలసినంత వుంది.

ఉద్యోగం అక్కర్లేక పోయినా చేస్తున్నాడు.

కావలసినంత తీరిక.

అంతా బాగానే ఉంది. సంతానమే కలగలేదు.

మొదట్లో రమ అంతగా బాధ పడలేదు.

క్రమక్రమంగా దిగులు మొదలైంది.

చిలికి చిలికి గాలివాన అయినట్టు పిల్లల్లేరని దిగులు పట్టుకొంది.

అంత్రాలు కట్టించుకొంది.

తాయెత్తులు కట్టించుకొంది.

అంతెందుకు పిల్లల కోసం చేయాల్సిన పనులు ఎన్ని ఉన్నాయో అన్నీ చేసింది.

ఏం లాభం ? పిల్లల్లేరు!

రాజు శరీర తత్త్వం తెలిపే పుస్తకాలు చదివాడు.

శృంగార గ్రంథాలు, రహస్యాలు పరిశీలించాడు.

ఏం లాభం ? పిల్లల్లేరు!

భార్యాభర్తలు అమ్మానాన్నలు, పోనీ అత్తామామలు అంతాకలిసి కూర్చొని తీరుబడిగా ఆలోచించారు.

రాజు ఒక్కగానొక్క కొడుకు ! రమ ఒకే ఒక్క కూతురు.

రెండు కుటుంబాలకు లెక్కలేనంత ఆస్తి ?

వారసులు లేకపోతే ఈ ఆస్తి ఏం కాను ? ఏమైపోను. దిగులు పడ్డారు. ఆలోచించారు.

పెద్దవాళ్ళు ఏకగ్రీవంగా ఆలోచించి, తీర్మానించారు.

రాజుకు మళ్ళీ పెళ్ళి !

రమ రాజులు ఒకేసారి వీల్లేదన్నారు.

తీరుబడిగా వీల్లేదన్నారు.

నిశ్చయంగా వీల్లేదని కుండ బద్దలు కొట్టారు.

కుండలోంచి చిందినట్లు నలుగురి కళ్ళల్లో నీళ్ళు.

ఏం చేస్తారు. వాళ్ళు మాత్రం!

వాళ్ళు మాత్రం ఎంతమందిని కన్నారు.

నానా అవస్థలు పడి వీళ్ళొక మగపిల్ల వాణ్ణి, వాళ్ళొక ఆడపిల్లని కన్నారు అంతే కదా!

వాళ్ళు మాత్రం ఏం ఘనకార్యం చేశారని?

వాళ్ళకు మాత్రం మొదట పదేళ్ళలో పిల్లలు కలిగారా ఏమన్నా నా?

ఏమైనా గట్టిగా అనాలంటే వాళ్ళకు మాత్రం ఎక్కడివి గుండెలు?

చివరకు ఏమీ చేయలేక సర్దుకొన్నారు.

ఏమిటో దేవుడిస్తే పుడతారు లేకుంటేలేదు.

ఎప్పటికైనా పుడితే సరే అంది. లేకపోతే వాళ్ళతదనంతరం ఆస్తులు ఏ అనాథాశ్రమానికో ఇస్తే ఏ పిల్లలో సుఖంగా బ్రతుకుతారు.

ఈ నిర్ణయం తీసుకొన్న తర్వాత అందరికీ ఏ ద్యాలనిపించింది.

అందరికళ్ళూ చెమ్మగిల్లాయి.

ఒకరోజు "ఏం మనకెప్పటికైనా పిల్లలు కలుగుతారంటావా?" రాజు నెమ్మదిగా, సానునయంగా అడిగాడు.

"ఏమో నాకేం తెలుసు" అందిరమ.

మనకి పిల్లలు కలక్కపోతే ఎలాగండి?" అని రమ ఒకనాడు అడిగింది.

'ఏమో అందుకు నన్నేం చేయమంటావు' రాజు ఎగిరిపడ్డాడు.

ఈ మధ్య రమ రాజు ఎడముఖం పెడముఖంగా వుంటున్నారు. ఇకఇకలూ లేవు. పక పకలూ లేవు.

మాట్లాడుకోవటమే తగ్గింది.

సినిమాలు చూడటం లేదు.

"నేనేం చేశానండి మీరిట్లా?" అని రమంటే.

"నేనేమో చేసాననే నువ్విట్లా" అని రాజు ఎగిరాడు.

వీళ్ళిట్లా అంటే ఎట్లాని రాజు తల్లి దండ్రులు రంగస్థల ప్రవేశం చేశారు.

నీతులు చెప్పారు.

ఉపదేశాలు చేశారు.

ఉపవాసాలు చేశారు.

రమ రాజులు బాగానే వుంటున్నారు. కాని మునుపున్నంత బాగుండటం లేదు.

పిల్లలు అన్యోన్యంగా ఉండటంలేదని రాజు తల్లిదండ్రులు రమ తల్లి దండ్రులకు వ్రాశారు.

వాళ్ళు వచ్చారు. ఏం మాట్లాడలేదు.

రాజు నీడలాగా రమ అనుక్షణం వెంటవుండే ఏర్పాటు చేశారు.

అయినా వాళ్ళు సంతోషంగా ఉండటంలేదు.

నలుగురు పోగై ఏం సంగతి అన్నారు.

వాళ్ళు మాట్లాడలేదు.

ఎందుకు మీరు సంతోషంగా లేరని ఖచ్చితంగా అడిగారు.

"ఏం మాకు పిల్లలు పుట్టారని సంతోషించాలా" అని ఇద్దరూ ఒకేసారి ఎగిరి పడ్డారు.

ఆ నల్గురికీ దిక్కు తెలియటం లేదు.

వాళ్ళకు పిల్లలు కలక్కపోవటానికి ఈ నలుగురే కారణమైనట్టుంది వాళ్ళ తీరుచూస్తే.

ఏం చేయాలో తెలియక పోవటమేకాదు. బిత్తర పోయారు. అంతే వెళ్ళి పోయారు. పుణ్యక్షేత్రాలకు పుణ్యం కోసం పోయారు. పోతే పోయారులే అని రాజు రమలేం మాట్లాడలేదు.

రోజులు గడిచాయి. వాళ్ళు రాలేదు.

సంవత్సరాలైంది వాళ్ళు వెళ్ళి! వస్తేనా? రాలేదు.

ఈ మధ్య ఒకసారి రమ ఒంట్లో ఏం బాగాలేదు.

రాజేం హృదయం లేనోడా, బాగానే చూచుకొన్నాడు.

రోగం ఏమీ ఘోరమైంది కాదు. తగ్గిపోయింది.

రమ కులాసాగా వుంది. ఇంట్లో ఎవళ్ళకు వాళ్ళు మునుపటికంటె ఎక్కువగా మాట్లాడుకోవలసి వస్తూ వుండేది.

ఏమైనా చెప్పాలంటే ఆ గదిలోంచి ఈ గదిలోకి రావటం తప్పనిసరి కావటంతో ఇద్దరూ ఒకే గదిలోకి చేరారు.

గది వదిలి వెళ్ళితే మళ్ళీ రావలసివస్తుంది కాబట్టి గది వదలటం లేదు.

ఇద్దరూ గదిలో వెలిగించని కొవ్వొత్తుల్లా కూర్చొని కబుర్లు తింటూ, నవ్వులు తాగుతూ వున్నారు.

వాళ్ళకిక ఆకలి దప్పులు లేవు. అన్నం నీళ్ళు లేవు.

ఒకరోజు రమ వాంతి చేసుకొంటూ వుంది.

కబుర్లు ఎక్కువగా తింది. అరక్క వాంతి చేసుకొంటూ ఉందని చెవులు మూశాడు.

చింతపండు నాకుతూ వుంటే 'ఏం పొయ్యేకాల మొచ్చిందని' తిట్టాడు.

నెలతప్పిందని చెబితే వినలేదు.

విన్న తర్వాత నమ్మలేదు.

దేవుళ్ళ మీద, బంధువుల మీద అన్నింటి మీద ఒట్టుపెట్టి చెబితే నమ్మాడు.

నమ్మిం తర్వాత ఇల్లు పీకి పందిరేశాడు. పందిరి పీకి ఇల్లేశాడు.

కాలుకాలిన పిల్లిలా తిరిగాడు.

పిచ్చివాడిలా అరిచాడు.

తిక్కవాడిలా తిరిగాడు.

వెర్రెక్కిన చాదస్తంలా నవ్వాడు

రమని ఎత్తి కుదేశాడు. ఎగిరి కూర్చున్నాడు.

'ఇదేం గొడవరా బాబోయ్' అని రమ దిగులుపడింది. భయపడింది.

ఏడుపు లంకించుకొంది.

రాజు మామూలై పోయాడు.

రోజు కొకసారి డాక్టరు దగ్గరకు తీసుకుపోయాడు.

డాక్టరు చెప్పింది.

రమకు బాధ కలగరాదని....,

కష్టం ఉండకూడదని....,

శ్రమపడరాదని....,

రాజు శ్రద్ధగా విన్నాడు

రమని మంచం దిగనియ్యలేదు. బయటకు పోనియ్యలేదు.

అన్నం మంచం మీదే! నీళ్ళు మంచం మీదే! అన్నీ మంచం మీదే! దిగనిస్తేనా?

'ఇదేందిరా బాబోయ్' అనుకొంది రమ.

డాక్టరు దగ్గరకు పోయారు. చెప్పింది.

ఇలా చేస్తే కాన్పు కష్టం అవుతుంది.

రమని మంచం దిగనియ్యాలి.

పని చెయ్యనియ్యాలి.

మరీ బండరాయిలా మూలనపడెయ్యరాదు అని చెప్పింది.

అంతే రాజు ఊరుకోలేదు.

రోజుకో సినిమాకు నడిపించుకుపోయి నడిపించుకు వస్తున్నాడు.

పార్కుకు పోక తీరదు.

బజారులో నడవక తప్పదు.

ఎవరైనా రమ కడుపు వైపు చూస్తూంటే రాజు ఎవరికీ కనబడకుండా కాలరు ఎగరేసుకొనేవాడు.

కాఫీ తెమ్మనేవాడు. మెట్లెక్కి దిగమనే వాడు.

ఎక్సర్‌సైజ్ కావాలనే వాడు.

"ఇదేం పీడరా తండ్రోయ్" అని రమ బెదిరింది..

దేశంలో అన్ని పుణ్య స్థలాలు, తీర్థాలు మళ్ళీ చూచే పనిలేకుండా చూచి నిశ్చితంగా రమ అత్త మామలు, అమ్మా నాన్నలు వచ్చారు.

రావటం రావటం తోనే విన్న వార్త, చూసిన దృశ్యం వాళ్ళను ఆశ్చర్యంలో ముంచాయి.

"ఎంత పని జరిగింది?" అని బాధ పడ్డారు. ఆనందం పొందారు.

వాళ్ళకు తోడు తాము లేకపోయినందుకు కృంగి పోయారు.

ఇప్పుడైనా వచ్చినందుకు సంతోషించారు.

ఇదంతా తాము లేకపోవటం వల్లే జరిగింది.

మగవాళ్ళు మీసాలు తిప్పారు. ఆడవాళ్ళు పైటలు సర్దుకొన్నారు

రమ ఏడ్చింది.

అది ఆనందం, దుఃఖం, సంతోషం, బాధ.

రాజుకు చేతకాని పరిరక్షకుడి ఉద్యోగం వూడి పోయింది.

ఈ నలుగురూ ఆ ఉద్యోగం చేపట్టారు.

రమ నవ్వింది బాధగా, ఆనందంగా!

రాజును వీళ్ళు దగ్గరకు రానివ్వటం లేదు.

అసలు రాజే పోవట్టం లేదు.

నిజానికి రమే చేరనివ్వటం లేదు.

రమ దేవతై పోయింది. పువ్వుల్లో పెట్టి పూజించుకొంటున్నారు.

డాక్టర్లకేం పనీపాటా లేనట్లుంది. వీళ్ళ ఇంటి దగ్గరే ఎక్కువగా కనిపించే వాళ్ళు!

ఉన్నట్టుండి ఒక రోజు రమని నర్సింగ్ హోమ్‌లో చేర్చారు.

రమేమో నవ్వుతూనే ఉంది. మిగతా వాళ్ళు కళ్ళ నీళ్ళతో వున్నారు.

అందరూ ధైర్యం చెపుతూ ఉన్నప్పుడు రమ ఏడుస్తూ ఉంది.

కానుపు అంత తొందర్లో కాదు.

కానీ ఎన్ని పరీక్షలు.

మొత్తం మీద ఏదో గొడవగానే ఉంది.

ఎక్స్‌రే తీశారు.

రక్తం పరీక్షించారు.

మందులు వాడారు.

ఇంజక్షన్లు ఇచ్చారు. నర్సింగ్ హోమ్ హడావిడిగా ఉంది.

రమకు నొప్పులు ప్రారంభమయ్యాయి.

అంత సుకుమారంగా ఉండే రమ, నడిచినా ధ్వని కాని, మాట్లాడినా శబ్దం కాని ఉండని రమ గొడ్డులా అరుస్తూ ఉంది.

రాజు కళ్ళల్లో నీళ్ళు, కళ్ళల్లోనే ఉంటే గుడ్లురిమి చూస్తాడేమోనని జారి పోయాయి.

వాళ్ళనలుగురూ కళ్ళొత్తు కుంటున్నారు.

నొప్పులు ఎక్కువ కావటంతో రమను థియేటర్‌లోనికి తీసుకు పోయారు.

కాన్పుల గదిలో రమను చూస్తుంటే రాజు గుండె చెరువు అవుతూంది.

అతణ్ణక్కడుండ కుండా నర్సులేకాదు అత్తమామలు కూడా తరిమేశారు.

రాజు అశక్తుడై బయట బల్లమీద కూర్చొని ఉన్నాడు.

డాక్టరు వచ్చిచెప్పింది.

'కాన్పు కష్టం'

రాజు కుంగిపోయ్యాడు.

'ఆమెనెలా అయినా బ్రతికించండి' అర్థించాడు.

"ఈ కాన్పుసరే కానీ మరోకాన్పు అయితే ప్రాణానికే ప్రమాదం."

డాక్టరు చెప్పింది.

ఐదుగురూ కూడబలుక్కొని చెప్పారు.

"తల్లినీ, బిడ్డనూ రక్షించండి, మరొక కాన్పు లేకపోయినా చింతలేదు. లేకుండా చేసినా సంతోషమే"

కష్టపు కాన్పు.

అంత బాధలోనూ రమ ఆలోచిస్తూవుంది.

వాళ్ళంతా పిల్లల్లేరని చంపుకుతిన్నారు.

పిల్లలు పుట్టబోతుంటే పుట్టకపోయినా ఫర్వాలేదని సర్దుకొంటున్నారు.

ప్రేమ పంచి ఇచ్చిన వాళ్ళే ప్రేమకోసం ప్రేమను బంధించారు.

ప్రేమలభిస్తుంటే తమ హృదయం దూరం చేసుకోక దుఃఖిస్తున్నారు.

సృష్టి ఎంత విచిత్రం.

ఇది అర్థమౌతుందా ?

సృష్టికి అర్థం ఉందా ?

రమ పెద్దగా అరిచింది.

అప్పుడే పుట్టిన పసిగుడ్డు నోరు విప్పి పెద్దగా అరిచింది.

రాజు కూర్చోలేకుండా ఉన్నాడు. ఆనందం పట్టలేకుండా అయిపోయాడు.

ఇద్దరు నాన్నలు, ఇద్దరు అమ్మలు వరండాను పాలిస్తున్నారు.

థియేటర్‌లోంచి ఎవరూ బైటికి రాలేదు.

రమ మూలుగుతూ వుంది.

బిడ్డ అరుస్తూనే వుంది.

రమ మళ్ళీ అరుస్తూంది.

బైట అందరికీ బాధ.

థియేటర్‌లోంచి ఎవరూ బైటికి రాలేదు.

ఏమైందీ తెలియటం లేదు.

రమ ఉన్నట్టుండి పెద్దగా భయంకరంగా అరిచింది.

మళ్ళీ ఏమిటి గొంతు ?

ఈ ఐదుగురికి ఏమీ అరతుపట్టలేదు.

థియేటర్ లోంచి నర్స్ బైటికొచ్చింది.

'రమకు సుఖ ప్రసవం, కవల పిల్లలు. మగ పిల్లలు!' అన్జెప్పి తక్కున లోపలికి పోయింది.

ఆమె చెప్పిందేమిటో ఎవరికీ అర్థం కాలేదు.

అర్థమైం తర్వాత రాజు ఎటు పోయాడో కనిపించలేదు.

మగవాళ్ళిద్దరూ ఆ వరండా అంతా తమ సామ్రాజ్యమే అయినట్లు చేయీ చేయీ పట్టుకొని నడుస్తున్నారు.

ఆపరేషన్ థియేటర్‌లోంచి రమను స్ట్రెచర్ మీద వెలుపలికి తీసుకొస్తున్నప్పుడు రాజు ప్రక్కనే ఉన్నాడు.

"రమకింక పిల్లలు పుట్టరు" ఎవరికీ చింతలేదు.

ఇద్దరు తల్లులు ఇద్దరు మనువళ్ళను ఎత్తుకొని ఓపికగా ఆడిస్తున్నారు.

రమా రాజులు వాళ్ళవైపు సంతోషంగా చూస్తున్నారు.

వాళ్ళకింకేం కావాలి?